

# రాగము-అనురాగము

ప్రహారీ గోడమీద దీపాలన్నీ జంటలు జంటలుగా వెలుగుతున్నాయి. తనూ రామారావూలాగా.

ఒక ప్రమిదెలో రెండు వత్తులు కలిసి ఒకటే దీపంగా వెలుగుతున్నాయి.

జానకి శరీరం గగుర్పాటు చెందింది. కిటికీ చువ్వల్లోంచి బయటకు చూస్తోంది. రామారావు గుండెకి కిటికీలు లేవు.

గాలి మెల్లిగా వీచింది.

జారుతున్న పమిటకొంగును సవరించుకుంది. రామారావు ఇంకా రాడేం అనుకుంది.

తాతయ్య, అమ్మ, చెల్లెళ్లు, పక్కింటివాళ్లు యావన్మందీ వసారా అరుగుమీద, క్రింద చేరారు.

'ఇంత ఆలస్యం అయిందేరా....'

'ఆలస్యం అయింది తాతయ్యా....'

'ఈ సమాధానం ఆఫీసుల్లో చెపితే డిస్మిస్ చేస్తారు....'

జానకి అతనివంక చూసింది. రామారావు జానకి కొత్త చీరె వంక చూశాడు.

జానకి తన చీరెవంక చూసుకుంది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ గదిలోకి వెళ్ళింది. ఒక నిమిషం ఎదురుచూసింది. రెండు నిమిషాలు చూసింది. పదిహేను నిమిషాలు అయింది. అడుగుల చప్పుడయింది. తలుపు చప్పుడు కాలేదు. రామారావు రాలేదు. ఉక్రోషం వచ్చింది.

చీరె మార్చి బయటకు వచ్చేసింది.

రామారావు పువ్వొత్తి కాలుస్తున్నాడు. వరండా స్తంభాని కానుకుని చూస్తోంది. తాతయ్య పడక కుర్చీలో కూర్చున్నాడు 'బాబాయి... మామయ్యా... నాకొకటి... నాకు రెండు....' పిల్లలంతా రామారావు చుట్టూ చేరి వేధిస్తున్నారు. పక్కింటి వాళ్ళమ్మాయి సరోజ మరీ చిన్నపిల్లేమీ కాదు. పదేళ్ళుంటాయి. రామారావు భుజంమీద చెయ్యివేసి నిలబడింది. జానకి చూసింది. ఇట్లా, అట్లా చూడలేదు. తీక్షణంగా చూసింది. అట్లా ఆనుకుని నుంచోవటానికి ఆ అమ్మాయికి హక్కు ఏముంది? జానకి అక్కడే నిలబడ్డా, ఆమె మనస్సు మాత్రం ముందుకుపోయి పక్కవాళ్ళందరినీ తోసి అవతల పారేసి, రామారావును కౌగిలించుకుంది.

'చిచ్చుబుడ్డి కాల్చరా...' తాతయ్య నోటీసు ఇచ్చాడు.

'నేను కాలుస్తా బాబాయి...' గోపి అడిగాడు.

'వద్దు.... కాలుతుంది. మీద పడతాయి పూలు'... రామారావు వారించాడు. సన్నికల్లో ఎవరో పిరికిమందు నూరుతున్న చప్పుడు వినిపించింది జానకికి.

ఎదురింటివాళ్ళబ్బాయి తూటాలు, జిల్లీలు కాలుస్తున్నాడు. ఎర్రని పూలన్నీ వదిలిపెట్టి, రయిమని విశాల విశ్వంలోకి ఎగిరి వస్తున్నాయి. బొగ్గు ముక్కల్లాగా తూటాలో పడి వుండటం కంటె, బూడిదయి పోయినా సరే ఒక్కసారి వెలగటంలో ఎంత ఆనందం ఉంది! జానకి మనసు పూలమాదిరిగా ఎగిరెగిరిపడుతోంది.

'ఎంతసేపూ పిల్లలచేత కాల్పించటమేనా.... నువ్వేమైనా కాల్చేది ఉందా?' తాతయ్య లోకజ్ఞానం అడిగింది.

రామారావు చిచ్చుబుడ్డి ముట్టించాడు.

'తూటాలు తెచ్చుకోలేదురా....' తాతయ్య ఉవాచ.

జానకి సమాధానం కోసం ఆత్రంగా ఎదురుచూసింది. రామారావు చిచ్చుబుడ్డిలోంచి ఎగిరే పూలవంక చిన్నపిల్లవాడి మాదిరిగా చూస్తున్నాడు.

'లేదు తాతయ్యా....' రాము చెప్పాడు.

'నాలుగు తూటాలు, ధరణాలు తెచ్చుకోవద్దట్రా తెలివి...'

తాతయ్య మందలించాడు. జానకి వళ్ళంతా కళ్ళు చేసుకుంది. ఎదురింటి వాళ్ళబ్బాయి విసిరేసిన తూటా రయ్‌మంటూ గాలిలోకి ఎగిరిపోయింది. చివరిదాకా చూసింది జానకి.

'ఆటంబాంబు కాలుస్తున్నాను; అంతా దూరంగా పొండి' రామారావు మిలిటరీ మనిషిలాగా ఆజ్ఞాపించాడు. జానకి అక్కడే నిలబడింది. రోడ్డుమధ్య చిన్న గుంట తీశాడు. అందులో బాంబు పెట్టాడు. మట్టి కప్పాడు. వత్తి కనపడుతోంది. బ్యాటరీలైటు తీసుకెళ్ళాడు. తీగె ముట్టించాలి. దానితో వెలిగించాలి.

'అంతా వెనక్కు పొండి.'

'గోపీని దగ్గరకు తీసుకుపోవే అమ్మా!'

'సరోజా, అరుగుమీదకు పో!'

'జానకీ...!'

జానకి ఆ పిలుపులో మాధుర్యాన్ని ఎంతగానో చవిచూసి, తరువాత మాటల కోసం ఎదురుచూసింది.

'నీకు గాదూ చెప్పేది...' ఎవరో చిన్నపిల్లను మందలిస్తున్నాడు రామారావు. ఆ పిల్ల పేరు కూడా జానకి కాబోలు! జానకి గబగబా అక్కడకు పోయి, ఆ బాంబు తీసి గోడవతల

పారేద్దామనుకుంది. అంత ధైర్యం ఎక్కడిది తనకు?

'అంతా చూడండి...' రామారావు కంగారులో బ్యాటరీలైటు కిందపడేశాడు. ఆటంబాంబు ముట్టించాడు. కంగారుగా పరుగెత్తుకుంటూ రాబోయి బ్యాటరీలైటును తన్ని, రాయి కొట్టుకుని ముందుకు పడ్డాడు. ఆటంబాంబు కాసిని పూలు వదలి విశ్రాంతి తీసుకుంది. రామారావు దుమ్ము దులుపుకుని లేచాడు.

'దెబ్బ తగిలిందిరా...' తల్లి అడిగింది.

'కాలు కొంచెం గీసుకునిపోయింది' అన్నాడు రామారావు. ఆ మాట చెప్పకపోతే ఏం అనుకుంది జానకి.

ఆటంబాంబు మోగనే లేదు. వసారా అరుగుమీద అంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వత్తి ఆరిపోయిందేమో!

'పోయి చూసి రారా' అన్నాడు తాతయ్య.

'దగ్గరకు పోయినప్పుడు పేలితే ప్రమాదం తాతయ్యా!' అన్నాడు రామారావు. 'ఆ సంగతి తాతయ్యకు తెలియదా' అంది జానకి హృదయం.

ఎదురింటి వాళ్ళబ్బాయి వచ్చాడు 'రావోయి రామారావు!...' అన్నాడు.

'ప్రేలుతుంది జాగ్రత్త....' అన్నాడు రామారావు.

అతను బాంబు పాతిపెట్టినచోటికి వచ్చి మట్టిని కాలితో తన్నాడు. బాంబు బయట పడింది. ఆరిపోయివుంది. రామారావు దగ్గరకు వెళ్ళాడు.

'వత్తి పోయింది. ఏం చెయ్యడం...'

'కొంచెం ఉన్నదిగా చాలు....'

'ముట్టించేలోపులోనే పేలుతుంది....'

'ముట్టించి అవతల పారేస్తే సరి'

'నేలలో పాతిపెట్టవద్దూ....'

'దీన్ని పాతిపెట్టటమెందుకు? చేత్తో పట్టుకుని ముట్టిస్తూనే అవతల పారేస్తే సరి' అన్నాడు అబ్బాయి.

రామారావు వసారాలోకి వచ్చాడు.

'వత్తి అంతా పోయింది తాతయ్యా!'

'మరి, అతను ఎలా కాలుస్తాడని' అన్నాడు తాతయ్య. జానకికి ఆ మందలింపు అర్థమయింది. అయిదడుగుల మనిషి అయిదంగుళాల మనిషి అయిపోయింది.

ఎదురింటి అబ్బాయి బాంబు ముట్టించి విసిరేశాడు. భూనభోంతరాళాలు దద్దరిల్లలేదుగాని పెద్ద చప్పుడే అయింది.

'చూశారా' అన్నాడు రామారావు.

జానకి స్తంభానికి ఆనుకున్నది మెల్లిగా కుప్పగా కూలిపోయింది.

ఆమె కళ్ళవెంట నీళ్ళు చెక్కిళ్ళ మీదుగా కారిపోతున్నాయి.

'కొత్త పిన్ని ఏడుస్తోందే!' అంది మాలతి. అంతా అటువైపు తిరిగారు.

'కంట్లో ఏమన్నా పడిందా?' అమ్మ అడిగింది.

'చూదరాదూ కొంచెం' ఇంకొకరు.

అమ్మ జానకిని ఇంట్లోకి తీసుకెళ్ళి, కళ్ళు పరీక్ష చేసింది. ఏం లేదే!' అంది. జానకి దుఃఖం కట్టలు తెచ్చుకుంది.

'మీ అమ్మవాళ్లు గుర్తుకువచ్చారా?' అమ్మ మళ్ళీ అడిగింది.

'అన్నాలు తిందురుగాని రండ్రా!'

తాతయ్య జానకివంక చూశాడు.

'వాళ్ళ అమ్మావాళ్లు గుర్తుకు వచ్చినట్లున్నారు, వదిలిపెట్టి ఉండటం ఇదే మొదటిసారి' అంది అమ్మ.

జానకి మెదలకుండా అక్కడినుంచి లేచి, గదిలోకి పోయింది. దిండుమీద ముఖం పెట్టుకుని, పరుపును కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

'చిన్నతనం' అంది అమ్మ.

'చితకతనం' అన్నాడు తాతయ్య.

ఎవరెన్ని మాటలు చెప్పినా, జానకి దుఃఖం ఆగలేదు. గదిలోకి పోయి దిండులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

రామారావు ఆటంబాంబు యెందుకు కాల్చలేదు. ఎదురింటి అబ్బాయి వచ్చి దాన్ని కాల్చిపారేస్తే తనక్కడ నిబడలేకపోయింది. తన భర్త పిరికివాడుగా కనబడటం తనని నిలువునా కుంగదీసింది.

రాత్రి భర్తతో మాట్లాడకూడదనుకుంది. వాకిట్లో టపాకాయలు పేలుతూనే వున్నాయి. జానకి మనసు ఆరాటపడుతూ రామారావు గురించి పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నది. తన భర్త పిరికివాడు. తన సంగతి పట్టదు. అందరికీ అన్ని మతాబులు ఇచ్చాడు. కాని తనకి ఒక్కటన్నా ఇచ్చాడూ?

రాత్రి భోజనాలయిన తర్వాత మెదలకుండా వచ్చి గదిలో కూర్చుంది. రామారావు వచ్చి ఏదన్నా పలకరిస్తాడు. తను మాట్లాడకూడదు. మాట్లాడకపోతే తను భరించిన అవమానం వారికి తెలిసేదెట్లాగు? సూటిగా ఎత్తి పొడిచి మాట్లాడాలి. అంత ధైర్యం ఎక్కడిది? ఊరికే మథనపడిపోతున్నది. ఉక్రోషం వస్తోంది.

రామారావు కుర్చీలో కూర్చున్నాడు.

చాపమీద బోర్లా పడుకుని పుస్తకం చదువుతున్నట్టు కూర్చుంది జానకి.

'ఒరేయ్ రామం....' అమ్మ పిలవటం వినిపించింది.

'ఏమిటమ్మా?....' రామారావు బయటకు వెళ్లాడు. రెండు నిమిషాల్లో లోపలికి వచ్చాడు. మళ్ళీ ముఖంలో కొంత ఆందోళనగా ఉంది. జానకి మహా చికాకు పడుతోంది.

రామారావు మెల్లిగా చాపమీదకు వచ్చి జానకిని చేతుల్లోకి తీసుకున్నాడు. జానకికి అసహ్యం వేసింది. 'మీరింత పిరికివారని తెలియదు' అందామనుకుంది. మాటలు రాలేదు.

'ఎదురింటి అబ్బాయి....' రామారావు ఏదో చెప్పబోయాడు. 'ఊఁ! ...' అంది జానకి విసుగ్గా.

ఆ అబ్బాయి చేతిలో ఇందాక టపాకాయ పేలిందట ....'

'ఊః—' జానకి గుండె దడ దడలాడింది.

'పాపం చెయ్యి కాలిపోతే ఆసుపత్రికి తీసుకువెళ్ళారు.....'

జానకి మనసు కల్లోలమయింది. ముఖం పైకెత్తి అతని కళ్లలోకి చూచింది. అతని రెండు చేతులూ స్పృశించింది. శిరస్సు అతని హృదయంమీద ఆనించి, అతన్ని దగ్గరకు గట్టిగా హత్తుకుని 'అటువంటి టపాకాయలు మీరెప్పుడూ కాల్చకండి...' అంది.

(యోజన - మార్చి-ఏప్రిల్-1962)